వారాంతపు కూరగాయల సంత

మోతీనగర్: ప్రతి ఆదివారం మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలు, పండ్లు, పూలు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి. అదే విధంగా అల్లాపూర్ డివిజన్, సెంట్రల్ అల్లాపూర్, శ్రీ వివేకానందనగర్, పర్వత్ నగర్ చౌరస్తాలో కూడా వారాంతపు కూరగాయల సంత కొనసాగుతుంది.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



మోతీనగర్: కొత్తూరు సీతయ్యనగర్‌లో శ్రీ రామాంజనేయ, శ్రీ విఘ్నేశ్వర, శ్రీ రామలింగేశ్వర నవగ్రహ దేవత విగ్రహాల ప్రతిష్టాపన సందర్భంగా సీతారాముల కళ్యాణం శనివారం కనుల పండుగగా నిర్వహించారు. కొత్తూరు సీతయ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివ, నరేందర్, బాలరాజ్, జై భానుచందర్, వై. కుమారస్వామి, పి. సురేష్, కిషోర్, సతీష్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలోకి..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండకు చెందిన ఎస్‌కె బీబీ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగా తిరిగి శనివారం సొంతగూటికి వచ్చారు. ఆమెకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్వాగతం పలికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంతోష్‌రావు, కాశీనాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, కిషన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం నుంచి చెలరేగిన మంటలు



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ జనప్రియనగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం ప్రహరీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా విద్యుత్ స్తంభానికి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మట్టిని పోసి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం సంభవించకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివిధ కేబుల్ వైర్లు ఉండటంతో వాటి వల్లనే ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

22న కూకట్‌పల్లిలో రోడ్‌షో

కూకట్‌పల్లి: ఈనెల 22న కూకట్‌పల్లిలో బీజేపీ నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని బీజేపీ నేతలు కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ రోడ్ షోకు సంబంధించిన ముందస్తు సమావేశం శనివారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో జరిగింది. కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, మాదవరం కాంతారావు హాజరై మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్, జన సమీకరణకు సంబంధించి అంశాలను బీజేపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూ రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్యార్చన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చనలో భాగంగా శనివారం నృత్య మయూరి కళానికేతన్ శిష్య బృందంచే నృత్యార్చన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు నైవేద్య, తేజస్వి, ఆరాధ్య, మనస్వి, రిషి, ప్రియ, సాహితి, సృష్టి, శ్రీనిధి కయాతి, శ్రీనిధి, మేఘన, లేక్షన, విష్ణుప్రియలు గణపతి కీర్తన, వరవీణ గీతం, రుక్మిణీ ప్రవేశ దరువు తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందికుమార్ కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

శిల్పారామంలో..

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మా దాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం సత్యం డ్యాన్స్ అకాడమీ గురువు మేళ్ల చెరువు కామేశ్వరీ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నమ రామాయణం, పూర్వరంగం, రామాయణ శబ్దం, శ్రీరామచంద్ర భావయామి, నగుమోము, దేహి, జగదానందకారక తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు. కళాకారులు అక్షిత, కీర్తన, విభా, ఇషితా, కళ్యాణి, శ్రావణి, సౌమ్య, శ్రీయ, సాయి సహస్ర, అనన్య జస్మితా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో రెండు వేర్వేరు ప్రదర్శనలను శనివారం ప్రారంభించారు. చిత్రకళాకారుడు వి.లక్ష్మణ్ వేసిన చిత్రాలను 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరిట చిత్రప్రదర్శనను సినీ నిర్మాత సాయివెంకట్ ప్రారంభించారు. కళాకారుడు వేసిన చిత్రాలను సందర్శకులు కొనియాడారు. ప్రదర్శనలో 27 చిత్రాలను అందుబాటులో ఉంచారు. నేటితో ప్రదర్శన ముగియనుందని నిర్వాహకులు ప్రకటించారు. దివ్యాంగ చిత్రకళాకారులు 41 మంది వేసిన 70 చిత్రాలను యాన్ ఇన్‌క్లూసివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరిట ప్రారంభించారు. ఈ ప్రదర్శన 23 వరకు కొనసాగనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తదితరుల పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల పరిచయ కార్యక్రమం

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 21న (నేడు) పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్ మారోజు రామాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అభ్యాసక సహాయ కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్స్, మోడల్ పేపర్లు, యూనివర్సిటీ యూ ట్యూబ్, వెబ్ రేడియోతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మూడో అంతస్తుపైనుంచి పడి వృద్ధురాలి మృతి

కూకట్‌పల్లి : ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచిపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సుభద్రమ్మ (78) కేపీహెచ్‌బీ రోడ్ నెంబర్ 2లో గల భవనం మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మనవడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మేడ్చల్ టాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి



సుచిత్ర సర్వీసు రోడ్డులో డివైడర్‌ను ఢీకొని నిలిచిపోయిన కారు (ఫైల్)

కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రతకు పెద్దపీట వేస్తూ వాహనదారులు నిబంధనలను అతిక్రమించకుండా కట్టడి చేస్తున్నామని మేడ్చల్ టాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆల్వాల్ ట్రాఫిక్ పీఎస్‌లో సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ ట్రాఫిక్ సజావుగా కొనసాగడానికి చేపట్టిన చర్యలపై వివరించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయని, తమ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా చర్యలు

- డ్రంకన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులపై 304 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి తీవ్రతను బట్టి జైలుకు సైతం పంపుతున్నారు.
- నెంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై 419 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు.
- మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులతో పాటు వాహనాలు ఇచ్చిన వారికి 3 నెలల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తున్నారు.
- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నామని ఏసీపీ పేర్కొన్నారు.

కఠిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రమాదాలు తగ్గుముఖం..

- 2020 సంవత్సరంలో యాక్సిడెంట్లు (238) జరిగితే 50 మంది మృత్యువాత పడ్డారు.
- 2021లో 269 ప్రమాదాలు చోటు చేసుకోగా 54 మంది మృతి చెందగా, 218 మంది గాయపడ్డారు.
- 2022లో 195 మంది ప్రమాదాలకు గురికాగా 55 మంది మృత్యువాత, 182 మందికి గాయాలయ్యాయి..
- 2023లో 172 ప్రమాదాలు చోటు చేసుకోగా 44 మంది మృతి చెందగా, 151 మంది గాయపడ్డారు.
- 2024 (మార్చి 31 వరకు) ప్రమాదాలు జరుగగా 12 మంది మృతి చెందగా, 49 మంది గాయపడ్డారు.

స్పెషల్ డ్రైవ్

- అదే విధంగా రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, మైనర్ల డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ వస్తున్నారు.
- 2020లో రాంగ్‌రూట్(21068), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1919), త్రిపుల్ డ్రైవింగ్ (12470), మైనర్ డ్రైవింగ్ (91), డ్రంకన్ డ్రైవ్ (1144) కేసులు నమోదయ్యాయి.
- 2021లో రాంగ్‌రూట్(20875), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (2242), త్రిపుల్ డ్రైవింగ్ (17713), మైనర్ డ్రైవింగ్ (181), డ్రంకన్ డ్రైవ్ (5402) కేసులు నమోదయ్యాయి.
- 2022లో రాంగ్‌రూట్(17381), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1995), త్రిపుల్ డ్రైవింగ్ (10460), మైనర్ డ్రైవింగ్ (71), డ్రంకన్ డ్రైవ్ (5906) కేసులు నమోదయ్యాయి.
- 2023లో రాంగ్‌రూట్(9290), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (2190), త్రిపుల్ డ్రైవింగ్ (6569), మైనర్ డ్రైవింగ్ (32), డ్రంకన్ డ్రైవ్ (5431) కేసులు నమోదయ్యాయి.
- 2024 (మార్చి 31 వరకు) రాంగ్‌రూట్ (5430), సెల్‌ఫోన్ డ్రైవింగ్ (1005), త్రిపుల్ డ్రైవింగ్ (2665), మైనర్ డ్రైవింగ్ (06), డ్రంకన్ అండ్ డ్రైవ్ (783) కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



మాట్లాడుతున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కూకట్‌పల్లి: కూకట్‌పల్లికి చెందిన పలువురు నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఈ నేతలు గత కొంతకాలంగా స్తబ్దతగా ఉన్నారు. అయితే ఎమ్మెల్సీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం మహేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు వీరందరు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అంగీకరించారు. శనివారం గొట్టిముక్కల జస్వంత్‌రావు (దేశాల్), మొలుగు భీమ్‌రావు, తులసివర్ధన్‌రావు, రామాంజన్ రెడ్డి, కొమ్ము బాబు, జాన్ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

వేసవిలో కుక్కలకు నీరు అందుబాటులో ఉంచాలి



కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ శనివారం కేపీహెచ్‌బీ బస్‌స్టాప్ మెయిన్‌రోడ్డులో కూకట్‌పల్లి జోన్‌లోని ఐదు సర్కిళ్ల వైద్యాధికారులు, మూసాపేట, కూకట్‌పల్లి డీసీలతో కలిసి వేసవిలో వీధి కుక్కలకు తాగునీటిని అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కుక్కకాటును అరికట్టడంలో పాటించాల్సిన, చేయకూడని పనులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడిసి అభిలాష అభినవ్ మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని వాణిజ్య సంస్థలలో టీ స్టాల్ విక్రయ స్థలాల వద్ద ఎగ్జిబిట్ బోర్డులు ఉండాలని, కుక్కకాటు నివారణకు జీవిపి పాయింట్లు పాటించాలన్నారు. వేసవిలో వీధి కుక్కలకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. నీరు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

రూ. 54.52 లక్షల నగదు స్వాధీనం



అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, రైటర్ సేఫ్ గార్డ్ వాహనం



మూసాపేట: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ సాగర్ తెలిపిన మేరకు.. ఎన్నికల తనిఖీలో భాగంగా కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని అల్లూరి కాంప్లెక్స్ వద్ద బాలానగర్ ఎస్‌ఓటీ టీమ్, కూకట్‌పల్లి పోలీసులు సంయుక్తంగా తనఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలో భాగంగా ఇటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వాహనాన్ని తనిఖీ చేయగా 54, 52,488 రూపాయల నగదును ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్నారని డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా బాలానగర్‌లో ఉన్న రైటర్ సేఫ్ గార్డ్ వాహనంలో డబ్బును తరలించవచ్చు. ఆ వాహనంపై క్యూ ఆర్ కోడ్ స్కానర్ ఉంటుంది. ఆ స్కానర్ చెక్ చేస్తే ఆ వాహనం ఏ రూట్‌లో వెళుతుంది. నగదు మొత్తం ఎంత, డ్రైవర్ ఎవరు, వాహనం పేరు, నంబర్ అన్ని వివరాలు వస్తాయి. కానీ ఈ వాహనంపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే స్కానర్‌లో ఉన్న వాహనం నంబర్, డ్రైవర్ పేరు కాకుండా వేరే నెంబర్ వాహనం, డ్రైవర్ వచ్చాయి. దీంతో వాహనాన్ని సీజ్ చేశారు. కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ (21), ఇటాచి నగదు నిర్వహణ సేవలు వద్ద సంరక్షకుడిగా గత 5 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడు. బేగంపేట ప్రకాష్ నగర్‌లోని శ్రీ లక్ష్మీ హాస్టల్‌లో నివాసం ఉండే పి. నగేష్ (22) ఇటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో కస్టోడియన్‌గా గత జనవరి నుంచి పనులు చేస్తున్నారు. డబ్బుకు ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే కరెక్ట్ గానే ఉందని, పత్రాలు చూపిస్తే ఎన్నికలు ముగిసిన తరువాత అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన అవసరం

సనత్‌నగర్: గ్యాస్ ప్రమాదాలపై గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అవగాహన కల్పించాలని సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా బల్కంపేటలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు ఆందోళన చెందకుండా వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపివేయాలన్నారు. ఎలక్ట్రిక్ స్విచ్‌లు ఆన్ చేయవద్దని, అలాగే దీపాలు, అగరబత్తిలను ఆర్పి వేయాలన్నారు. గాలి, వెలుతురు కోసం అన్ని కిటికీలు, దర్వాజాలను తెరవాలని సూచించారు. ఎల్‌పీజీ డిటెక్టర్‌ను వంట గదిలో ఏర్పాటు చేసుకునేలా వినియోగదారుల్లో అవగాహన పెరగాలన్నారు. గ్యాస్ లీక్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేయడమో లేకుంటే తడిపిన గోనె సంచి, తడి బట్టను మండుతున్న సిలిండర్‌పై వేసి వెంటనే ఖాళీ స్థలంలోకి తీసుకువచ్చి వదిలేయాలన్నారు. కాగా నిప్పును ఆర్పే యంత్రాల పనితీరుపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాలుగు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'టెక్నోస్మానియా–2024'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ టెక్నాలజీ కాలేజీలో మూడు రోజులుగా కొనసాగిన ×టెక్నోస్మానియా–2024₹ శనివారం ముగిసింది. కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ఎండీ రాజమౌళి, హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. కార్యక్రమంలో టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొ.శ్రీనునాయక్, అధ్యాపకులు ప్రొ.రమేశ్‌కుమార్, ప్రొ.వీవీ బసవరావు, ప్రొ.రాజం, పరుశురామ్, పరమేశ్వర్లు, డా.సాదం.ఐలయ్య, డా.వి భాస్కర్, డా.అనిత, డా.కవిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. డివిజన్ అధ్యక్షులు మారెల్ల శ్రీనివాస్‌రావు, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఓటింగ్ శాతం పెంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పరిధిలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందాల సహాయంతో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వీప్ సిబ్బంది సమన్వయంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందాలు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో స్వయం సహాయక సంఘాలు, జీహెచ్ఎంసీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఓటింగ్ శాతం పెంపుపై వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించినట్లు స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు తెలిపారు. దండెపెల్లి శ్రీనివాస్ సాంస్కృతిక సారథి కళాజాత బృందాలు ఓటింగ్ శాతం పెంపు కోసం పలు కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలను చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు.

చేవెళ్ల గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

ఆల్విన్‌కాలనీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన చేవెళ్ల బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు, ఆయా డివిజన్‌ల అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్‌పటేల్, రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, నాయకులు అందరు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్‌యస్ పార్టీయే గెలుస్తూ వస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనూ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందని, కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో టైల్స్ మెగా ప్రదర్శన

మాదాపూర్: వినియోగదారులకు మరిన్ని ఆధునిక ఉత్పత్తులు అందించడంలో సెరామిక్ టైల్స్ తయారీ కంపెనీ హెచ్ అండ్ ఆర్ జాన్సన్ 3000ల కొత్త టైల్ డిజైన్‌లను ప్రదర్శించింది. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం ప్రీజం జాన్సన్ విభాగమైన హెచ్ అండ్ ఆర్ జాన్సన్ అధ్వర్యంలో మెగా ప్రదర్శన నిర్వహించారు. ప్రీజం జాన్సన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అగర్వాల్ టైల్ డిజైన్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ భారతదేశంలో అగ్రశ్రేణి టైల్స్ కంపెనీల్లో ఒకటిగా పేరు గాంచిందన్నారు. తాజాగా అందుబాటులోకి తెచ్చిన వాటిలో ప్లస్ వీఈ టైల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణానికి పెద్దపీట వేస్తుందన్నారు.

భవనం నుంచి నిత్యం మురుగునీటి ప్రవాహం



మురుగు నీటితో గుంతలమయంగా మారిన రోడ్డు..

కుత్బుల్లాపూర్ : నిత్యం ఆ రోడ్డుపై డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. చుట్టుపక్కల ఇళ్లు లేనప్పటికీ ఎక్కడి నుంచి డ్రైనేజీ వస్తుంది అని పలువురు ఆరా తీస్తే పక్కనే ఉన్న ఒక కమర్షియల్ బిల్డింగ్ నుంచి డ్రైనేజీ ఇతర అవసరాలకు ఉపయోగించిన నీరంతా రోడ్డుపైకి వదిలేస్తున్నారు.. ఇదే విషయంపై సంబంధిత సిబ్బంది వెళ్లి నిలదీస్తే నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ.. బెదిరింపులకు దిగడం విశేషం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ వైష్ణవి మెడోస్, వుడ్స్ కాలనీతో పాటు ఇతర కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు పొంగుతుంది. సమీపంలో ఉన్న కట్ట మైసమ్మ ఆలయం వరకు డ్రైనేజీ నీరు వెళ్తుండడం, ఇదే క్రమంలో రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో స్థానికులు సర్కిల్ అధికారులతో పాటు వాటర్ వర్క్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గల్పర్ సహాయంతో ఎక్కడైనా లీకేజీలు ఏర్పడ్డాయా అన్న విషయంపై ఆరా తీస్తూ ముందుకు వెళ్తుండగా కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టి అందులో పలువురికి హోటల్ లకు ఇతర అవసరాలకు అద్దెకు ఇచ్చిన సదరు నిర్మాణదారుడు డ్రైనేజీ నిర్మాణం ఇలా బహిరంగంగా వదిలివేయడం గుర్తించారు. ఇదే విషయంపై వారిని ప్రశ్నించగా... నీ ఇష్టం ఉన్న దగ్గర చెప్పుకో అంటూ బెదిరించి వెళ్ళగొట్టడం విశేషం. డ్రైనేజీ నీరు రోడ్లపై వదిలితే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధిస్తున్న కొంతమంది తీరు మారకపోవడం విశేషం. ఏది ఏమైనా ఈ డ్రైనేజీ నీటిని రోడ్డుపై వదిలిన సంబంధిత బిల్డింగ్ యజమానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో..! వేచి చూద్దాం. కాగా ఈ విషయంపై వాటర్ వర్క్స్ మేనేజర్ అనూషను 'సాక్షి' వివరణ కోరగా తాను పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటానని, డ్రైనేజీ నీటిని బహిరంగ ప్రదేశాల్లో వదిలితే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.



రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు..



ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు నీరు..